ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 81
సంచిక : 201
పేజీలు : 3

ఆదివారం, ఏప్రిల్ 05, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కేంద్ర బృందం



**టీ మీడియా,ఏప్రిల్ 4, కూసుమంచి:**ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం క్రింద నిర్మితమవుతున్న గృహాలను కేంద్ర బృందం శనివారం కూసుమంచి మండలంలో పరిశీలించింది. మండల కేంద్రం కూసుమంచి . నాయకన్ గూడెం గ్రామాల్లో స్వయంగా లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. గృహ నిర్మాణపురోగతి,పనులు,ఖర్చు, బిల్లుల చెల్లింపులు తదితరం గురించి స్వయంగా లబ్ధిదారుల నుండి కేంద్ర బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని బృంద సభ్యులు అభిలాష్, వరుణ్ లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి, కార్యదర్శి నీరజ, మాజీ ఎంపీటీసీ సభ్యులు మాదాసు ఉపేందర్ రావ్, వార్డు సభ్యులు అంతటి వెంకన్న, ఎండి హఫీజ్దీన్, కొండ మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

### క్షేత్రస్థాయిలో పర్యటనలతో

# సమస్యలపై స్పందించాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్





**టి మీడియా, ఏప్రిల్ 4, ఆళ్లపల్లి :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత స్థాయి క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, విద్యాసంస్థలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యవసాయ క్షేత్రాలు తదితరాలను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "క్షేత్రస్థాయిలో పర్యటనలు పెంచి ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి" అని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం ప్రతి అధికారి బాధ్యత అని తెలిపారు . భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, వాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.మొదటగా అనంతోగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, గ్రామంలో మంజూరైన 19 ఇళ్లలో ప్రస్తుతం 3 ఇళ్లు రూఫ్ స్థాయికి చేరుకున్నట్లు అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారు గలిగ నాగలక్ష్మి ఇంటి నిర్మాణాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, పనుల నాణ్యత, వినియోగిస్తున్న సామాగ్రి, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి నాణ్యమైన గృహాన్ని అందించాలన్న లక్ష్యాన్ని సాధించాలన్నారు .ఆళ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకుని, బయాలజీ వంటి విషయాల్లో డయాగ్రామ్స్ ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పాఠశాల కిచెన్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యుత్ సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసిన నేపథ్యంలో, ఇన్వర్టర్ ఏర్పాటు ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఆళ్లపల్లి గ్రామంలో రైతు మద్దెల వెంకటేశ్వర్లు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను పరిశీలించిన కలెక్టర్, సాగు విధానం, దిగుబడి, ఆదాయం వంటి అంశాలపై రైతుతో చర్చించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. మండలంలో 400 ఎకరాల లక్ష్యానికి గాను 290 ఎకరాల్లో సాగు పూర్తయిందని అధికారులు వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ విభాగాలు, ల్యాబ్, మందుల గది తదితరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అవసరమైన అన్ని మందులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, వాటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. 108 అంబులెన్స్ సేవలను కూడా పరిశీలించి, అత్యవసర సేవలపై వివరాలు సేకరించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, కార్యాలయ పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా "క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలి" అని స్పష్టం చేశారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.మండలంలోని త్రాగునీటి పరిస్థితిపై విచారించిన కలెక్టర్, మిషన్ భగీరథ ద్వారా సరఫరా సక్రమంగా కొనసాగుతున్నప్పటికీ, ఎండాకాలంలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాటర్ ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, లేకపోతే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫాగింగ్ యంత్రాల వినియోగంపై కూడా సమీక్షించారు. మొబైల్ సిగ్నల్ సమస్యలపై విచారించగా కొన్ని గ్రామాల్లో కనెక్టివిటీ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.వ్యవసాయ రంగంపై సమీక్షలో భాగంగా మండలంలో సాగు అవుతున్న పంటల వివరాలు తెలుసుకున్నారు. నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, బోర్ల ద్వారా సాగునీటి అందుబాటుపై అధికారులను ప్రశ్నించారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి, ప్రతి మహిళను సంఘాల్లో సభ్యురాలిగా

మిగతా 3లో

## ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనుగోళ్లు

### -జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**టీ మీడియా , ఏప్రిల్ 4 , మహబూబాబాద్ :**మహబూబాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, అదేవిధంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మొక్కజొన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్దతు ధర కల్పిస్తూ కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో ఈ సంవత్సరం లక్ష 30 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు జరిగిందని, సుమారు లక్ష ఎకరాల మొక్కలు కొనుగోలుకు వస్తున్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్లో అన్ని వసతులు సౌకర్యాలు కల్పించాలని వచ్చిన మొక్కజొన్నలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు చేయాలని, మద్దతు ధర 2400/- చెల్లించాలని రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి ఈ నామ్ విధానం ద్వారా కొనుగోలు చేయాలన్నారు, పెసర్లు, మినుములు, వేరుశనగ, తదితర పంటల వైపు రైతులకు అవగాహన కల్పించాలని ఈ పంటల ద్వారా ప్రస్తుతం మార్కెట్లో అధిక ధరలు పలుకుతున్నందున రైతులు లాభాలలో ఉంటారని అన్నారు,మార్కెట్లో అంతర్గత సౌకర్యాలను అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు, కలెక్టర్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ సుజన్ బాబు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, ఏ డి ఏ శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ డిఎం వెంకటేశ్వర్లు, ఏఓ తిరుపతిరెడ్డి, ఉన్నారు.

## అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీకారం

### -ఆలయ భూమి పూజ , డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**టీ మీడియా ,ఏప్రిల్ 4 ,కొణిజర్ల:** కొణిజర్ల మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ శ్రీకరం చుట్టారు.కొణిజర్ల గ్రామంలో భక్తుల కోరిక మేరకు నిర్మించనున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి ఎమ్మెల్యే శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం గాంధీ బజార్ సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.కార్యక్రమం అనంతరం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూరంపల్లి రామారావు నివాసంలో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సూరంపల్లి రామారావు , గ్రామ సర్పంచ్ మరియు ఇతర నాయకులు కొణిజర్ల గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ప్రధానంగా రైతుల ప్రయోజనాల దృష్ట్యా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలి.గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇతర అభివృద్ధి

మిగతా 3లో





## అంగన్వాడి కేంద్రాలకు ప్రత్యేక కమిటీ

**టీ మీడియా, ఏప్రిల్ 4, దమ్మపేట:** దమ్మపేట పంచాయితీ పరిధిలో గల అర్భన్ కాలనిలో ఇటీవల ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ గా నిర్మించిన అధునాతన అంగన్వాడీ కేంద్రంకు 11 మందితో కూడిన ప్రత్యేక కమిటీ సభ్యులుగా చైర్ పర్సన్ సర్పంచ్ పగడాల రమాదేవి, వార్డు సభ్యుడు రూపా రాంబాబు, ఆశా కార్యకర్త ఎన్. రమణ, గర్భిణి పి. రష్మి, బాలింత సి.హెచ్ కనకదుర్గ, పిల్ల తల్లులు టి.రాజ్యలక్ష్మి, పి.భారతి, ఉపాధ్యాయురాలు ఎం.డి. తస్లీమా, వి.ఓ.లు సి.హెచ్ నాగమణి, వై.బిందు, అంగన్వాడి టీచర్ ఎం.డి గౌస్య లను శనివారం నియమించారు.ఈ ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీల నిర్వహణ, గర్భిణీలకు, చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ, ఆహారా తనిఖీ, శుభ్రత, మౌలిక సదుపాయాలు, పిల్లల హాజరు, ప్రతి నెలా సమావేశం ఏర్పాటు, అంగన్వాడీ కేంద్రం పనితీరు, మందు బిళ్ళల పంపిణి, ఆరోగ్య పరీక్షలు నిర్వహణ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు అందరు సహకరించాలి అని, పోషకాహారం గర్భిణుల ఆరోగ్యానికి, శిశువు ఎదుగుదలకు ఎంతో అవసరమని, కేంద్రంకు కావల్సిన సదుపాయాలు ఏమి కావాలన్నా సమకూర్చుతామని సర్పంచ్ తెలియజేశారు.ప్రభుత్వం తరపున ఇచ్చే పోషకాహారంని లబ్దిదారులకు సర్పంచ్ రమాదేవి, వార్డు సభ్యులు రూపా రాంబాబు కలిసి పంపిణి చేశారు. పిల్లల బరువును నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల రాంబాబు వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, పగడాల రాంబాబు, అంగన్వాడీ కేంద్రం నిర్వాహకులు టీచర్ సి.హెచ్ సుమతి, హెల్పర్లు సి.హెచ్ విజయ, కే.ఆదేమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## పేద మధ్యతరగతి పై ధరల భారం : సిపిఎం

**టీ మీడియా, ఏప్రిల్ 4,ఇల్లందు:** అధిక ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నేతలు అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్ కుమార్ అన్నారు. మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతూ యుద్ధ ప్రభావంతో ధరలు 30--40 శాతం పెరిగి కొనుగోలు శక్తి తగ్గిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు నియంత్రించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. గ్యాస్, టిఫిన్ ధరలు పెరగడంతో శ్రామిక వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. మీసేవ ఛార్జీలు పెరగడం ప్రజలపై మరింత భారమైందన్నారు. ధరలు నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**టీ మీడియా, ఏప్రిల్ 04, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి క్రాస్ రోడ్ లోని 33/11 కేవీ కారేపల్లి సబ్ స్టేషన్ నందు మరమ్మతులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకన్న తెలిపారు. సింగరేణి (కారేపల్లి) గ్రామానికి విద్యుత్ సరఫరా ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు(3 గంటలు) నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఏఈ కోరారు.

# పరిహారం కు నాన్ ఏజన్సీ రేట్లు నిర్ణయించాలి



**ఎకరాకు రూ.19లక్షలు,**

**గజానికి రూ.6300 : అధికారులు**

**ఎమ్మెల్యే జోక్యంతో మరో సారి సమావేశం**

**టీ మీడియా, ఏప్రిల్ 4,సింగరేణి(కారేపల్లి):** రైల్వే డబ్లింగ్ లైన్ కోసం సింగరేణి రెవిన్యూ గ్రామ పరిధిలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నాన్ ఏజన్సీ రేట్లు చెల్లించాలని రైల్వే లైన్ నిర్వాసితులు అధికారులను కోరారు. డోర్నకల్ - భద్రాచలం రోడ్ రైల్వే డబ్లింగ్ లైన్ పనుల కోసం సేకరించిన భూములకు రేటు విషయమై చర్చించేందుకు ఖమ్మం జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి సింగరేణి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ నిర్ణయించిన రేటును స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నిర్వాసితుల ఎదుట ప్రకటించారు. వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.19 లక్షలు, ఇళ్ల స్థలాలకు గజానికి రూ.6300 చెల్లిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల భూసేకరణలో చెల్లించిన రేట్లనే చెల్లిస్తామని అధికారులు పేర్కొనడంతో దానికి నిర్వాసితులు అంగీకరించలేదు.సింగరేణి రెవిన్యూ గ్రామంలో నాన్ ఏజన్సీ అని అక్కడి భూముల ధరలను కూడా పరిగణలోకి తీసుకొని మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని బాధితులు కోరారు.10 శాతం అయినా పెంచాలని భూ నిర్వాసితులు ప్రాధేయపడ్డారు.నిర్వాసితులకు పరిహారం నిర్ణయించటానికి రెండోసారి ఏర్పాటు చేసిన సమావేశం లో కూడా పరిహారం పెంచడంలో అధికారులు నిర్ణయం తీసుకోలేదు. దీంతో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జోక్యం చేసుకోని అధికారులు, నిర్వాసితులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సమక్షంలో మరోసారి సమావేశం ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పించమని అధికారులను నిర్వాసితులు కోరారు. వారం రోజులలో ఏర్పాటు చేసే సమావేశం నాటికి ఆలోచించుకొని నిర్ణయం తెలపాలని నిర్వాసితులను అధికారులు కోరారు.

**అధికారులతో ఫోన్ లో మాట్లాడిన వైరా ఎమ్మెల్యే**

కలెక్టరేట్ లో శనివారం నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సిద్ధమయ్యారు. ఈ సమావేశానికి అత్యవసర పనుల వల్ల కలెక్టర్, జేసీ సమావేశానికి అందుబాటులో ఉండటం లేదని తెలియటంతో ఎమ్మెల్యే ఫోన్ జేసీ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి తో మాట్లాడారు. రైతులు, ఇళ్ళు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని కోరారు.మరో సమావేశానికి తాను తప్పనిసరిగా హాజరవుతానని అధికారులు, భూ నిర్వాసితులతో చర్చించి ఆ సమావేశంలో రేటు ఫైనల్ చేద్దామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు నిర్వాసితులు పాల్గొన్నారు.

# సింగరేణి మండలానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలి

**సీపీఐ(ఎం) వైరా డివిజన్**

**కార్యదర్శి భూక్య వీరభద్రం**

**చీమలపాడులో అమరజీవి**

**రాచర్ల రామయ్య వర్ధంతి**

**టీ మీడియా,ఏప్రిల్04,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలం పూర్తి వర్షాదారం, బోర్లపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారని దీంతో సాగునీరు అందక పంటలు పండని పరిస్థితి ఉందని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం కారేపల్లి మండలం చీమలపాడులో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి రాచర్ల రామయ్య 30వ వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు అజ్మీర్ శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80ఏండ్లు దాటిన ఏజెన్సీ ప్రాంతాలకు అభివృద్ధి అందని ద్రాక్షగానే ఉందన్నారు.సింగరేణి, కామేపల్లి మండలాల సాగునీటి సమస్యకు సీతారామ ప్రాజెక్టు నీళ్లతోనే పరిష్కారం అవుతుందన్నారు. ఖమ్మం జిల్లా లో ముగ్గురు మంత్రులు, కీలక శాఖలు నిర్వహిస్తున్నా ఏజెన్సీ మండలాలకు నీరు అందించడంలో విఫలమయ్యారని, సొంత నియోజకవర్గాలకు నిధులు కేటాయించడం, నీళ్ల తీసుకెళ్లడం వంటి పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. ఏజన్సీ మండలాలకు గిరిజన శాసనసభ్యులు ఉండి సాగు నీరు అందించకపోవడం వారి లొంగుబాటుకు, స్వార్థ ప్రయోజనాలకు తార్కానమన్నారు. చీమలపాడు ప్రాంతంలో కాలువల నిర్మాణానికి భూములు పోగొట్టుకున్న రైతులకు 2013 నిర్వాసితుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారరు. పత్తి మిర్చి పంటలు దెబ్బతిని ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న పంట వేశారని పంట కొనుగోలుకు ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికకు పేదల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఇది సహించరానిదన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు ఇవ్వకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చీమలపాడు ప్రాంతంలో రాచర్ల రామయ్య వంటి అమరులు పేదలకోసం నిరంతరం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. వారి స్ఫూర్తితో పేదలపక్షం వహించి పోరాటాలకు సిద్దం కావాలని కోరారు. అంతకు ముందు రాచర్ల రామయ్య స్తూపం వద్ద జెండాను భూక్య వీరభద్రం ఎగర



వేశారు. ఈ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు, వల్లబోయిన కొండలరావు, సీనియర్ నాయకులు ఎర్రిపోతు భద్రయ్య, మన్నెం బ్రహ్మయ్య, రాచబంటి పుల్లయ్య, పోతురాజు చంద్రరావు, శాఖ కార్యదర్శులు సురభాక సర్వయ్య, బానోత్ కిషన్, భానోత్ మంగీలాల్, రాచర్ల రణధీర్, షేరు వెంకటేశ్వర్లు, లలితమ్మ, మచ్చర్ల రమేష్, గోకినపల్లి భారత లక్ష్మీ, రాచర్ల నాగమణి, రాచర్ల జాలమ్మ, రాచర్ల రాంబాబు, సురభి ఉపేందర్, మాలోత్ హనుమ, భూక్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా ఎస్‌బిఐటి కళాశాల వార్షికోత్సవం

**-ముఖ్య అతిధిగా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసాచార్యులు**

**ప్రతి విద్యార్థికి ప్లేస్‌మెంట్ మాలక్ష్యం**

**-కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ**

**టి మీడియా,ఏప్రిల్ 4,ఖమ్మం :**యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాల 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసాచార్యులు హాజరై విద్యార్థులకు ప్రేరణతో కూడిన సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగితే దేనినైనా సాధించవచ్చన్నారు. విద్యార్థులు తెల్లవారుజామునే నిద్రలేచి ప్రణాళిక ప్రకారం విధ్యను అభ్యశించాలన్నారు. కళాశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలు ఎంత ముఖ్యమో సమాజంలో జరిగే సంఘటనలు



కూడా విద్యార్థి ఎదుగుదలకు అంత ముఖ్యమని అన్నారు. సమాజంలో జరిగే సంఘటనల ద్వారా మంచిని తీసుకొని చెడుని విసర్జించాలని సూచించారు.

**బాధ్యతగల పౌరులుగా రూపొందాలి :చైర్మన్**

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఖమ్మం యస్.బి.ఐ.టి. కళాశాలలో మహానగరాల కళాశాలలకు దీటుగా విద్యాభోదన కొనసాగుతుందని దీనికి తమ కళాశాల విద్యార్థులు సాధిస్తున్న ప్లేస్‌మెంట్‌లే సాక్ష్యం అన్నారు. గత 3 సంవత్సరాలుగా తమ కళాశాల నూటికి నూరు శాతం ప్లేస్‌మెంట్స్ సాధిస్తుందని తెలిపారు. దీని వల్ల తమ కళాశాలకు ప్రతిష్టాత్మకమైన అటానమస్ హోదా లభించిందని అన్నారు. యస్.బి.ఐ.టి.లో రాష్ట్రంలోని పలు కళాశాలల కంటే మిన్నగా విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ సాధిస్తున్నారని దీనికి కళాశాల యాజమాన్యం ఐ.బి.యమ్., ఐ.సి.టి.సి., క్యాప్‌జెమినీ, వర్చూసా వంటి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని ఆయా కంపెనీల



ద్వారా విద్యార్థులకు అవసరమైన శిక్షణను పలు విభాగాలలో అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మట్లాడుతూ విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ అందించేందుకు తమ కళాశాలలో ప్రత్యేకమైన టి.పి.ఒ. విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విభాగం విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. కళాశాల వైస్‌చైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన యస్.బి.ఐ.టి. కళాశాల కీర్తిని మరింత ఇనుమడింప చేసేలా విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥. జి. రాజ్‌కుమార్ మాట్లాడారు.

అనంతరం సింగర్ సాగర్, సమీరా బరద్వాజ్ ఆధ్యర్యంలో జరిగిన సంగీత విభావరిలో పాటిన పాటలు సంగీత ప్రియులను మంత్రముగ్దులను చేసాయి. అదేవిధంగా విద్యార్థుల నృత్యాలు అందరిని అలరించాయి. చివరగా పలు విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు అతిధులు బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

